క్లుప్తంగా

సుబ్రహ్మణ్య శర్మకు పురోహిత మిత్ర బిరుదు



కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు కంచిబొట్ల సుబ్రహ్మణ్య శర్మకు పురోహిత మిత్ర బిరుదు వరించింది. డాక్టర్ సీవీ రామన్ అకాడమీ లలిత సమాఖ్య వారు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సువర్ణ కంకణ ధారణతో పురోహిత మిత్ర బిరుదుతో సత్కరించారు. సీవీ రామన్ అకాడమీ కార్యదర్శి మహేంద్ర వాడ వెంకటేశ్వరరావు, బ్రహ్మశ్రీ కృష్ణచాముండేశ్వర మహర్షి, కోశాధికారి మనోరంజని, ఉపాధ్యక్షురాలు గొరీసు జాత పాల్గొన్నారు.

విద్యాభ్యాసానికి వైకల్యం ఆటంకం కారాదు



ఆగిరిపల్లి(నూజివీడు): విద్యాభ్యాసానికి, నైపుణ్య వికాసానికి అంగవైకల్యం అవరోధం కాకూడదని హీల్ పారడైజ్ సీనియర్ ఫ్యాకల్టీ మిక్కిలినేని హరీష్ అన్నారు. మండలంలోని తోటపల్లిలోని ఎలిజబెత్ పాంటన్ లెగసి ఆఫ్ హోప్-హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో మంగళవారం పలువురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. దీనిలో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా సిద్ధవటంకు చెందిన ఈ తేజవర్ధన్, పశ్చిమగోదావరి జిల్లా పూళ్లకు చెందిన వి.సతీష్ కుమార్, విజయవాడ రూరల్ మండలం పాతపాడుకు చెందిన బి.సంతోష్, కృష్ణా జిల్లా కోసూరుకు చెందిన కె నరేంద్ర దేవ్‌కు కృత్రిమ కాళ్లను అందజేశారు. కార్యక్రమంలో హీల్ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మైలవరం: అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ ప్రభుత్వం పనులు చేస్తుందని సర్పంచ్ మంజుభార్గవి తెలిపారు. మైలవరం తారకరామానగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 40 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఇచ్చిన మాట ప్రకారం మైలవరం తారకరామానగర్‌లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు, ఉప సర్పంచ్ సీతారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలను సమగ్రంగా నిర్వహించాలి



ముసునూరు: మండల మహిళా సమాఖ్యల ఆర్థిక లావాదేవీలను చాకచక్యంగా, సమగ్రంగా నిర్వహించాలని వైఎస్సార్ క్రాంతి పథం నూజివీడు ఏరియా కో-ఆర్డినేటర్ విజయ కుమారి పేర్కొన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం కుంటం బాబు అధ్యక్షతన సీసీలు, వీఓఏలకు ఆర్థిక లావాదేవీల నిర్వహణ, ఆర్థిక వ్యవహారాల నిబంధనలపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సంఘాల, మండల సమాఖ్యల ఆర్థిక నిర్వహణ, సీబీఓలలో ఆర్థిక అక్షరాస్యతల ఆవశ్యకత, సంస్థలు పనిచేయాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. నిధుల దుర్వినియోగ నివారణలో విజిలెన్స్ పాత్ర తదితర అంశాలను వివరించారు.

పశువులకు ఉచిత వ్యాక్సినేషన్



గాదెవారిగూడెం(గంపలగూడెం): మండలంలోని గాదెవారిగూడెంలో మంగళవారం పశువులకు ఉచిత వ్యాక్సినేషన్ చేశారు. వైద్యాధికారి అభిలాష్ పర్యవేక్షణలో 150 తెల్లపశువులకు లంపస్కిన్ వ్యాక్సిన్, 220 గేదెలకు గురక వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేశారు. సర్పంచ్ చెన్నా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు

ఎమ్మెల్యే రక్షణనిధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మండలంలో డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా రూ. 10వేల పింఛన్ అందిస్తున్నామన్నారు. అలాగే కిడ్నీ వ్యాధుల ప్రభావిత గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు పది ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. గిరిజన తండాల్లో ట్రాక్టర్ల ద్వారా కృష్ణాజలాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. శాశ్వత పరిష్కారానికి రూ. 50కోట్లతో కృష్ణాజలాలు ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా అందించేందుకు టెండర్లు కూడా పూర్తయ్యాయని,త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. గత టీడీపీ హయాంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు చేసింది శూన్యమన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇంటింటికీ వెళ్లి వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకునే విధంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జ్వరాలు అధికంగా ఉన్నప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచయతీలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో రూ.20 లక్షలు మంజూరు చేసి అభివృద్ధి పనులకు ఉపయోగిస్తున్నామన్నారు. మండలాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు అధికారులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, వైస్ ఎంపీపీలు గుంటక శివారెడ్డి, సిద్ధం పద్మ, ఎంపీడీఓ కేవీఎస్ నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పాలం ఆంజనేయులు, అత్తనూరు వెంకటరెడ్డి, జి.వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు పుల్లారావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు టి. సురేష్ పాల్గొన్నారు.

పంచాయతీ వార్డు సభ్యుల ఎన్నికలకు షెడ్యూలు విడుదల

ముసునూరు: మండలంలోని మూడు గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న మూడు వార్డు సభ్యుల భర్తీకి ఎన్నికల షెడ్యూలు విడుదలైనట్లు జిల్లా సహాయ ఎన్నికల అథారిటీ, ఎంపీడీఓ జి.రాణి మంగళవారం తెలిపారు. ముసునూరులోని 11వ వార్డు సభ్యురాలు రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడగా, కాట్రేనిపాడు 10వ వార్డు సభ్యుడు, వేల్పుచర్ల 10వ వార్డు సభ్యుడు చనిపోవడంతో అక్కడ ఖాళీలు ఏర్పడినట్లు తెలిపారు. ఆయా స్థానాలకు ఈ నెల 19న ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్లను పరిశీలిస్తామని తెలిపారు. 14వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణ, అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికలు అవసరమైన చోట 19వ తేదీ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి కౌంటింగ్ అనంతరం ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. ముసునూరు 11వ వార్డు రిటర్నింగ్ అధికారిగా లింగపాలెం మండల వ్యవసాయాధికారి కోటగిరి మురళీకృష్ణ, కాట్రేనిపాడు 10వ వార్డుకు లింగపాలెం ఎంఈఓ కె.రామారావు, వేల్పుచర్ల 10వ వార్డుకు లింగపాలెం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.టి.వి.ఎస్.ఎన్ జగన్నాథరావును నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందినట్లు తెలిపారు.

రెండు గ్రామాల్లో ఉప ఎన్నిక

తిరువూరురూరల్: మండలంలోని రెండు గ్రామాల్లో పంచాయతీ వార్డు సభ్యుల పదవులకు ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. ఎర్రమాడు పంచాయతీలో ఏడో వార్డుకు, వామకుంట్ల ఎనిమిదో వార్డుకు ఉప ఎన్నిక నిమిత్తం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఎర్రమాడు, వామకుంట్ల గ్రామ పంచాయతీలలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందని, రెండు వార్డులకూ ఒక్కొక్క నామినేషన్ దాఖలైందని మంగళవారం తెలిపారు.



ఎర్రమాడులో వార్డుసభ్యుని పదవికి నామినేషను వేస్తున్న హరిబాబు

సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

గంపలగూడెం: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆమె అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి వసతి పెంపుదల, రహదారుల అభివృద్ధికి తగిన ప్రాధన్యం ఇచ్చి నిధులను కేటాయించినట్లు తెలిపారు. జనరల్ ఫండ్స్ నుంచి రూ.73 లక్షలు, తాగునీటి సరఫరా, రహదారుల నిర్మాణానికి కేటాయించామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2.05 కోట్లను పలు గ్రామాల్లో తాగునీటి వసతి, ఇతర అభివృద్ధి పనులకు కేటాయించినట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్ఎంసీ సభ్యులు

ముసునూరు: చారిత్రక ముసునూరు హైస్కూల్లో పని చేయడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నట్లు పూర్వపు హెచ్ఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. ముసునూరు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పనిచేస్తూ, ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా అంతర మండల పాఠశాలలకు, నూజివీడు, ఆగిరిపల్లి మండలాలకు బదిలీ అయిన హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అల్లా బక్షు, శైలజ, వెంకటేశ్వరరావు, బంగారమ్మ, మునీర్ బేగం, సుకుమార్, జె.రంగారావు, ఏ రంగారావు, కృష్ణవేణి, రఫీని మంగళవారం ప్రస్తుత హెచ్ఎం సునీల అధ్యక్షతన తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులంతా ఆదర్శవంతమైన సేవలందించి, విద్యాభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. ఈ సందర్భంగా 11 మంది ఉపాధ్యాయులను స్థానిక ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం సన్మాన గ్రహీతలైన ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధి కోసం రూ.10,000ను హెచ్ఎంకు అందజేశారు.

పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో మెరుగైన పారిశుద్ధ్యానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపాల్టీలోని వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం కోసం ప్రత్యేక కార్యచరణ చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం స్థానిక బీ కాలనీ తదితర ప్రాంతాల్లో నిల్వ ఉన్న చెత్తను డంపింగ్ యార్డ్‌కు ట్రాక్టర్ల ద్వారా తరలించారు. తాగునీటి సరఫరా ప్రత్యేక కార్యచరణతో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. స్థానికులు తమ ఇళ్లల్లోని చెత్తను చెత్త కుండీల్లోనే వేయాలని ఆయన సూచించారు.

నేటి నుంచి 'నా భూమి-నాదేశం'

ఇబ్రహీంపట్నం: భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల సందర్భంగా ఏడాది పాటు నిర్వహించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు ముగింపులో 'నాభూమి నాదేశం' కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రతి గ్రామంలో నిర్వహించాలని ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9న గుంటుపల్లి, దాములూరు, 10న తుమ్మలపాలెం, చిలుకూరు, 11న జూపూడి, కాచవరం, 14న మూలపాడు, కేతనకొండ, 15న కొటికలపూడి, ఈలప్రోలు గ్రామాల్లో నిర్వహించాలని తెలిపారు. ఐదు రోజుల పాటు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలు, 15న జెండా ఆవిష్కరణలు చేయాలని పేర్కొన్నారు.

'నా భూమి-నాదేశం' నిర్వహించాలి

నూజివీడు: మండంలోని ప్రతి గ్రామంలో నా భూమి- నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆజా దీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు.

దోమల నిర్మూలనకు కృషి



దోమల నిర్మూలన చర్యలు చేపడుతున్న వైద్య సిబ్బంది

ముసునూరు: డెంగీ, మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులను అంతమొందించాలంటే అందరం దోమల నిర్మూలనకు కృషి చేయాలని నూజివీడు సబ్ యూనిట్ వైద్యాధికారి యలమంద పిలుపునిచ్చారు. ముసునూరు, గోపవరం, వేల్పుచర్లల్లో దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో మనమే పరిసరాలను కాలుష్య కాసారాలు చేస్తున్నామన్నారు. దీంతో హానికరకమైన దోమలు, ఈగలు అధికమై, రోగాలు ప్రబలి మానవ జీవితం దెబ్బతింటోందన్నారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వారంలో ఒక రోజు డ్రై డేగా పాటించాలన్నారు. పరిశుభ్రతతోపాటు, పరిసరాల్లో మొక్కలు పెంచాలని అన్నారు.

రామకృష్ణ పబ్లిక్ ట్రస్టు భూమి లీజుకు టెండర్లు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లికి చెందిన శ్రీ రామకృష్ణ పబ్లిక్ ట్రస్టుకు చెందిన సర్వే నంబరు 54లోని 8.66 ఎకరాల భూమిని 11ఏళ్లకు లీజుకు ఇచ్చేందుకు దేవదాయశాఖ పిలిచిన ఈ- సీల్డు టెండర్లను మంగళవారం గ్రామంలోని ఆలయ ఆవరణలో తెరిచారు. గత నెల 24న ఈ భూమి లీజు హక్కుకు ఈ- టెండర్, బహిరంగ వేలంకు సంబంధించి అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11గంటలకు టెండర్ల బాక్సులను తెరవగా ఐదు టెండర్లు వచ్చాయి. ఈ- టెండర్లు ఎవరూ వేయలేదు. బహిరంగ వేలంలో ఎవరూ పాల్గొనలేదు. దీనిపై మాజీ సర్పంచి గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు కోర్టులో కేసు వేశారు. తుది తీర్పు వచ్చే వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారులు ఇంకా టెండర్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని శ్రీ రామకృష్ణ పబ్లిక్ ట్రస్టు ఈఓ విశ్వేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌జేసీ ఎంవీ సురేష్‌బాబు, ల్యాండ్ ప్రొటెక్షన్ డిప్యూటీ కలెక్టర్ భారతి, డిప్యూటీ కమిషనర్ విజయరాజు, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, గన్నవరం ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

'క్విట్ ఇండియా' కీలక ఘట్టం

మైలవరం: భారతదేశ స్వాతంత్ర్య సమరంలో క్విట్ ఇండియా కీలక ఘట్టమని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. ఆ కళాశాలలో క్విట్ ఇండియా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. చరిత్ర అధ్యాపకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ పలికిన డూ ఆర్ డై (సాధించు లేదా మరణించు) అను నినాదంతో ఈ ఉద్యమం యావత్తూ భారతదేశం అంతటా వ్యాపించిందన్నారు. గాంధీని బ్రిటిష్ వారు అరెస్టు చేశారని పేర్కొన్నారు. అనంతరం రైతులు, విద్యార్థులు కలిసి క్విట్ ఇండియా ఉద్యమాన్ని నడిపించారన్నారు. ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎస్కే కరీ ముల్లా పాల్గొన్నారు.

పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో మంగళవారం షిరిడి సాయిబాబా సేవా కమిటీఆధ్వర్యంలో క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న పలువురు నాయకులు చిత్ర పటాలను ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో దుంపా రవీంద్ర రెడ్డి, జగన్నాథం, యజ్ఞకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి ల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం రాక

తిరువూరురూరల్: మండలంలోని ఆరు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనుల పరిశీలనకు బుధవారం కేంద్రబృందం రానున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అక్కపాలెం, చింతలపాడు, గానుగపాడు, లక్ష్మీపురం, ముష్టికుంట్ల గ్రామాల్లో జరిగిన పనులను పరిశీలించడానికి కేంద్రబృందం వస్తున్నట్లు తెలిపారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: జల జీవన్ మిషన్ కార్యక్రమం అమలు తీరు పరిశీలనకు బుధవారం ఢిల్లీ బృందం అధికారులు గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తారని ఆ మిషన్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ తెలిపారు. కనుమూరు, వినగడప, అనుముల్లంక, మేడూరు, చెన్నవరం, రాజవరం, గుళ్లపూడి గ్రామాల్లో అధికారుల బృందం పర్యటిస్తారని పేర్కొన్నారు.

నేడు మండల సమావేశం

విస్సన్నపేట: స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో బుధవారం సాయంత్రం మూడు గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి హాజరవుతారని పేర్కొన్నారు.

సైపులైన్ల నిర్మాణ పనులు ప్రారంభం



తిరువూరులో పైపులైన్ల నిర్మాణ పనులు

తిరువూరు: పట్టణంలో రక్షితమంచినీటి సరఫరాకు నిర్దేశించిన కృష్ణానదీ జలాల పైలట్ ప్రాజెక్టులో భాగంగా కొత్త పైపులైన్ల నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. కట్టిలేరులోని పంపింగ్ స్కీం నుంచి ప్రధాన పైపులైన్ల మార్పిడి పనులు జరుగుతున్నట్లు నగర పంచాయతీ అధికారులు తెలిపారు. రూ.40లక్షల వ్యయంతో పైపులైన్లు మార్పు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించండి

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధినిరోధక టీకాలు వేయించాలని కొటికలపూడి సర్పంచ్ నాగరాజు పేర్కొన్నారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం వ్యాధినిరోధక టీకాలు చిన్నారులకు వేశారు. సకాలంలో టీకాలు వేయించడం ద్వారా చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి అనారోగ్యాలు దరిచేరవని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి నాగేశ్వరి పాల్గొన్నారు.

తోలుకోడులో..

తోలుకోడు(మైలవరం): పిల్లలకు టీకాలు వేయించి, వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సర్పంచ్ ఓబులరెడ్డి దుర్గారెడ్డి తెలిపారు. మైలవరం మండలం తోలుకోడులో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని సర్పంచ్ దుర్గారెడ్డి మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు గ్రామాల్లో తిరిగి టీకాలు వేయించుకోని పిల్లను గుర్తించి వారి కి కూడా టీకాలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

గానుగపాడు(తిరువూరురూరల్): విద్యార్థినులు తగినంత పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని తిరువూరు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి రేష్మా సూచించారు. మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పౌష్టికాహార ఆవశ్యకతపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. రోజూ పళ్లు, పాలు, పీచుపదార్థాలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. హెచ్ఎం సాయిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి ఆధారిత కోర్సులు వినియోగించుకోండి



శిక్షణ పూర్తైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉపాధి ఆధారిత కోర్సులను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన స్కిల్ హబ్ ద్వారా ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన రెండు నెలల ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ స్కిల్ హబ్‌లో 30 మంది యువతకు ఇండస్ట్రీ నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చామన్నారు. ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన నిరుద్యోగ యువత ఖాళీగా ఉండకూడదనే సంకల్పంతో ఉచిత శిక్షణను కళాశాల ఆవరణలో నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన 26 మందికి విజయవాడ పరిధిలోని ఇండస్ట్రీల్లో ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. జూన్‌లో జరిగిన జూనియ డెవలపర్ కోర్సులో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ నరేష్ కుమార్, స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ రవి తేజ పాల్గొన్నారు.

లాభాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి

ఆగిరిపల్లి(నూజివీడు): ప్రతి గ్రామైక్య సంఘం లాభాలు ఎక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎం బొలగాని రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్థిక నిర్వహణపై శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండల సమైక్య, గ్రామైక్య సంఘాలు స్వయం ఆధారితంగా అభివృద్ధి చెందడానికి విధి విధానాలు రూపొందించుకోవాలన్నారు. మండలంలో 43 గ్రామైక్య సంఘాలుండగా 42 సంఘాలు లాభాల్లో ఉన్నాయన్నారు. ఎల్‌సీ సీసీ పీ ప్రసాద్, మండల సమైక్య ఉపాధ్యక్షురాలు సుమతి, సీసీలు వెంకటరత్నం, లక్ష్మీ, అరుణకుమారి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం

చాట్రాయి: నులి పురుగులను నివారించేందుకు ప్రజలు సహకరించాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ సందర్భంగా మంగళవారం నిర్వహించిన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. ఎంపీడీఓ దుర్గాప్రసాదు, ఎంఈఓ బ్రహ్మచారి పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి

చాట్రాయి: వృద్ధురాలిపై ఇరువురు దాడి చేయడంతో ఆమె తీవ్ర గాయాల పాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. టి.గుడిపాడుకు చెందిన ఆడమిల్లి లూర్దమ్మపై అదే గ్రామానికి చెందిన శ్రీకాకుళం జోజి, అతని భార్య కలిసి దాడి చేశారు. ఈ దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు కావడంతో ఆమెను 108 వాహనంలో నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మండల తహసీల్దార్ విశ్వనాథరావు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి వృద్ధురాలిని పరామర్శించారు.

వైభవంగా సహస్ర నామ పారాయణం

విజయవాడ కల్చరల్: శ్రీ శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో శ్రవణ సదనంలో లోక కల్యాణార్థం శ్రీ మహావిష్ణువు లక్షతులసి అర్చన, విష్ణు గాయత్రి సహిత పూర్వక సహస్రనామ, విష్ణుకవచ పఠన కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక ప్రజలు నిర్వహించారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రావణమాసం విష్ణువుకు అత్యంత ప్రియమైనదని తెలిపారు.